క్లుప్తంగా

నాగార్జునకు సత్కారం


నాగార్జునను సత్కరించిన దృశ్యం

సాక్షి, భీమవరం: సమాచార శాఖ ఏడీ దాసరి నాగార్జున డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై కాకినాడ బదిలీ అయిన సందర్భంగా గురువారం ఆయనకు ఏపీ యూడబ్ల్యూజే పట్టణ శాఖ ఆధ్వర్యంలో అభినందన సత్కారసభ నిర్వహించారు. సమాచార శాఖ కార్యాలయంలో నాగార్జునను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీవీఎల్ పరామర్శ


హనుమాన్ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: మండలంలోని తరటావ మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగుల వీర హనుమాన్ ప్రసాద్‌ను గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. ప్రసాద్ కుమారుడు గంగుల తేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తేజ చిత్రపటానికి పూలమాలవేసి పీవీఎల్ నివాళులర్పించారు. పిన్న వయస్సులోనే మృత్యువు ఒడికి చేరడం దురదృష్టకరమన్నారు. పుత్రశోకం తీరనిదని పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు తదితరులున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో రెండు ఆవుల మృతి

పాలకొల్లు సెంట్రల్: బైక్ ఢీకొట్టడంతో గర్భంతో ఉన్న ఆవు మృతి చెందిన సంఘటన పట్టణంలోని యడ్లబజారు సెంటర్‌లో చోటుచేసుకుంది. గురువారం సొసైటీ ప్రివెన్షన్ యానిమల్ క్రుయాలిటీ సభ్యుడు మనీష్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి రోడ్డుపై సంచరిస్తున్న గర్భంతో ఉన్న ఆవును స్కూటీ వాహనంతో ముగ్గురు యువకులు మద్యం మత్తులో వేగంగా వెళుతూ ఆవు పొట్టను ఢీకొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారన్నారు. అలాగే మరో ఆవును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కదలలేని స్థితిలో ఉందని, దీంతో ఆ ఆవును ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందినట్లు తెలిపారు. శానిటరీ అధికారులకు విషయం తెలియజేయడంతో ఆ రెండు ఆవులను ఖననం చేయడానికి తరలించినట్లు మనీష్ తెలిపారు.

మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

నరసాపురం: మహిళపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జె.నాగేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని పొన్నపల్లిలో గురువారం పెమ్మాడి ఏసు, పెమ్మాడి రామన్న సోదరులు ఇద్దరూ గొడవపడుతూ రోడ్డుపై కేకలువేసుకుంటూ, బూతులు తిట్టుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడే నివాసం ఉంటున్న తిరుమాని మంగతాయారు వారిని వారించడంతో ఇద్దరూ ఆమెపై తిరగబడి దాడి చేశారు. దీంతో మంగతాయారు పోలీసులను ఆశ్రయించింది.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరం

నరసాపురం: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ తన సేవలను గ్రామీణులకు మరింత దగ్గర చేసే ప్రయత్నం చేస్తుందని నరసాపురం ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజర్ చినిమిల్లి రాము సూచించారు. గురువారం సాయంత్రం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో చిట్టవరం గ్రామంలో గ్రామ సాచంత్రం శిబిరం పేరుతో గ్రామస్తులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ రాము మాట్లాడుతూ సురక్ష, భద్రత కలిగిన లావాదేవీలకు ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలన్నారు.

ఆటో ఢీకొని కేటరింగ్ కార్మికులకు గాయాలు

పాలకొల్లు అర్బన్: కేటరింగ్ నిమిత్తం పాలకొల్లు నుంచి మోటార్‌సైకిల్‌పై సఖినేటిపల్లి వెళుతున్న ముగ్గురిని శుక్రవారం ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఈ కేసుకి సంబంధించి పాలకొల్లు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బెత్లహాంపేటకు చెందిన యార్లగడ్డ తాతయ్య, అతని కుమారుడు అనిల్‌కుమార్, వీరి బంధువు ఏసేబురాజు మోటార్ సైకిల్‌పై సఖినేటిపల్లి వెళుతున్నారు. సగం చెరువు శ్మశానం వద్ద వీరిని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తాతయ్య, అనిల్‌కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఏసేబురాజుకి స్వల్ప గాయాలయ్యాయి. వీరు ముగ్గుర్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య నిమిత్తం పాలకొల్లులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు కారణమైన మొగల్తూరు పంచాయతీ పరిధిలోని లక్కువారిపేటకు చెందిన ఆటో డ్రైవర్ వీరవల్లి హనుమంతుని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సరిదే శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- వలంటీర్లకు అవార్డులు ప్రదానం


వలంటీర్లను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, అధికారులు


సిద్ధాపురంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో వలంటీర్లకు సేవవజ్రా, సేవామిత్ర, సేవారత్న అవార్డుల ప్రదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలకు ప్రతి రూపం వలంటీర్ వ్యవస్థ అని స్పష్టం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ మందికి సేవలు అందిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న వలంటీర్ వ్యవస్థను అభినందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలు పొందుతూ ఎంతో ఆనందంగా ఉన్నారంటే ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వారికి అనుకూలంగా ఉన్నవారికే లబ్ధి చేకూరేదన్నారు. కానీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన అనంతరం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నరన్నారు. ప్రజలు ఇంత ఆనందంగా ఉన్నారంటే ఆ క్రెడిట్ అంతా వలంటీర్లకే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. వృద్ధులకు పింఛన్లు, ఏ సంక్షేమ పథకాలు పొందాలన్నా వలంటీర్లకు చెబితే చాలన్నారు. అవినీతికి తావులేకుండా ప్రతి ఇంటికి మేలు జరుగుతోందన్నారు. మరొక్కసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలని అన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి, ప్రతి ఏడాది వారిని సన్మానించడం మంచి ఆలోచన అన్నారు. అదే విధంగా గ్రామంలో ఆర్‌బీకే నిర్మాణానికి, పంట కాలువపై వంతెన నిర్మాణానికి పీవీఎల్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఏలూరుపాడు, జువ్వలపాలెం, ప్రాతళ్లమెరక, కలవపూడి, మాలవానితిప్ప, బోస్ కాలనీ, పల్లిపాలెం గ్రామాలకు చెందిన 72 మంది వలంటీర్లకు పురస్కారాలు అందించడంతోపాటు దుశ్శాలువాలు, ప్రశంసాపత్రాలు, పతకాలను అందించి ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష, కలవపూడి సొసైటీల అధ్యక్షుడు పెన్మెత్స ప్రసాదరాజు, ఎంపీటీసీ సభ్యులు చిన్నాపరపు రాంబాబు, దాట్ల శ్రీనివాసరాజు, సర్పంచ్‌లు భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, మీసాల శ్రీనివాసరావు, ఎస్.నాగరాజు, టి.బాలాజీ, మండల పరిషత్ ఏట ప్రభాకరరావు, మంతెన రామకృష్ణంరాజు, కోనా రంజిత్, ముదుండి సురేష్, పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థతో అవినీతికి చెక్

ఆకివీడు: అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజల ఇంటికి చేరవేసే వలంటీర్ వ్యవస్థ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింరాజు చెప్పారు. మండలంలోని సిద్ధాపురం, చినమిల్లిపాడు, కోళ్లపర్రు సచివాలయ పరిధిలోని సేవా మిత్ర, సేవా రత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సిద్ధాపురం సచివాలయంలో గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ పార్టీ, కులం, మతం, వర్గ బేధాలు లేకుండా ప్రభుత్వ పథకాల్ని అర్హులకు అందజేయడంలో వలంటీర్లు మంచి ఫలితాల్ని పొందారని చెప్పారు. పథకాలు లబ్ధిదారులకు అవకతవకలు లేకుండా చేరవేడంలో వారికి వారే సాటిగా నిలిచారన్నారు. టీడీపీ పాలనలో అరకొర సంక్షేమ పథకాలు కూడా ప్రజలకు చేరడంలో తీవ్ర అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి చోటుచేసుకున్నాయని పీవీఎల్ విమర్శించారు. పింఛను పథకం మంజూరు నుంచి పంపిణీ వరకూ తీవ్ర లోపాలతో సాగిందన్నారు. అవ్వాతాతలు మంటుటెండల్లో పడుగాపులు పడ్డారని, ప్రాణాలమీదకు తెచ్చుకునేవారని పీవీఎల్ ఆరోపించారు. అటువంటి దుస్థితి నుంచి లబ్ధిదారుల్ని ఆదుకునేందుకు వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుజేశారన్నారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, నాడు–నేడు పనులు, విద్యా దీవెన, వసతి, చేయూత, ఆసరా వంటి పథకాలు అమలుజేస్తున్న ముఖ్యమంత్రి జగన్ పరిపాలన కావాలా, వాటిని రద్దు చేసే ప్రభుత్వం కావాలో ప్రజలు తేల్చుకోవాలని పీవీఎల్ సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థతోనే రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు ప్రపంచఖ్యాతి పొందుతున్నాయన్నారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ చిట్టిబాబు, ఇందుకూరి నారాయణరాజు మాట్లాడుతూ గ్రామంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్లు, పైపులైన్ల విస్తరణ వంటి పనులు పూర్తి చేశామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, పుప్పాల పండు, జీ.ధనరాజు, ఎస్.రామరాజు, తోట శివాజీ, షడ్రక్ పాల్గొన్నారు.

సమాజానికి అనుకూల కళారూపాలు రావాలి


భీమవరంలో మాట్లాడుతున్న సీతారామ్‌ప్రసాద్

సాక్షి, భీమవరం: సమాజంలో మార్పునకు అనుకూలంగా కళారూపాలు రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యం మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. గురువారం ఇండియన్ పీపుల్ థియేటర్స్ ఆఫ్ అసోసియేషన్ (ఇప్టా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజా నాట్యమండలి జెండాను స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదిత్య కళావేదిక వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్టా 1943 మే 25న ముంబైలో ఏర్పాటైందని, నాటి నుంచి దేశమంతా శాఖలు ఏర్పాటు చేసి ఎందరో కళాకారులను తీర్చిదిద్దారన్నారు. 1943లో స్వాతంత్ర్యోద్యమ సమయంలో కళాకారులను సమీకరించి పాటలు, నాటకాలు, బుర్రకథలు వివిధ రకాల కళారూపాలు ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో కళారంజని వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, మావుళ్లమ్మ సూర్యోదయ నాట్యమండలి వ్యవస్థాపకులు పులగం నాగ నరసింహారావు, ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొన్నబత్తులు మల్లేశ్వరరావు, ప్రజా నాట్యమండలి కళాకారులు పులఖండం ఉగాది, కాటి వెంకటరత్నం తిరుమాని చంటి రాజు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు దాతలు చేయూతనివ్వాలి


ఇంటర్ విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

సాక్షి, భీమవరం: ప్రతిభ కలిగి పేదరికంతో ముందుకు సాగలేని విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతనందించాలని ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీ విజ్ఞానవేదిక అధ్వర్యంలో ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ ప్రతిభవంతులను ప్రభుత్వం కూడా అనేక పథకాలతో సహకారం అందిస్తోందని, 32 ఏళ్లుగా శ్రీవిజ్ఞానవేదిక ఎంతో మంది దాతల సహకారంతో ప్రతిభవంతులకు ప్రోత్సాహక అవార్డులు అందివ్వడం అభినందనీయమన్నారు. అధిక శాతం ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 2023–24 ఇంటర్ విద్య సంవత్సరంలో భీమవరంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక అవార్డులను లయన్స్ క్లబ్, బార్ అసోసియేషన్ ఆర్థిక సహకారంతో మెడల్స్, ప్రశంసా పత్రాలను ఆర్డీవో దాసి రాజు చేతుల మీదుగా అందజేశామన్నారు. డాక్టర్ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకట రమణ, నందమూరి రాజేష్, కె.రవి, కె.మురళీకృష్ణంరాజు, కె.భవాని షితల్, ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాస్, ఇందుకూరి ప్రసాద్ రాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కె.శిరీష, ఇంటర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి


చినమిల్లిపాడులో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్‌కు మొరపెట్టుకుంటున్న కూలీలు

ఆకివీడు: మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్‌కు విజ్ఞప్తి చేశారు. సిద్ధాపురం గ్రామంలో గురువారం ఎంపీడీఓను కలిసిన కూలీలు మాట్లాడుతూ తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడంలేదని, చేసిన పనికి పూర్తి స్థాయిలో కూలి రావడంలేదని మొరపెట్టుకున్నారు. అరకొర కూలితో జీవనం గడపడం కష్టంగా ఉందన్నారు. వారం రోజుల పనికి రెండు వేల రూపాయలు కూడా రావడం లేదని వాపోయారు. పని చేసిన కూలి సొమ్ము ఖాతాలో జమ అయితే దానిని బాకీలో జమచేస్తున్నారని మహిళా కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తక్షణం మేట్‌తోనూ, టెక్నికల్ అసిస్టెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎంపీడీఓ శ్రీకర్ హామీ ఇచ్చారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ జేడీవీ మృతికి నివాళి

భీమవరం(ప్రకాశం చౌక్): మునిసిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ జేడీవీ సత్యనారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మున్సిపల్ కార్యాలయంలో జేడీవీ చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ జేడీవీ మృతి బాధాకరం అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిజేస్తున్నామన్నారు. మున్సిపల్ ఉద్యోగులు కామేష్‌బాబు, చంటి, రాజు, మహంకాళీ, కృష్ణమోహన్, జగన్ తదితరులు నివాళులర్పించారు.

కపర్ది ఆశయ సాధనకు కృషి చేయాలి


కపర్ది చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు కపర్ది ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సీపీఐ, కార్మికోద్యమనేత ఎంవీఎస్ కపర్ది వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కపర్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, కార్మిక హక్కుల సాధనకు కపర్ది అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ఆర్టీసీ జాతీయకరణలో కపర్ది కృషి మరువలేనిదన్నారు. నాయకులు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సీహెచ్ సుందర్ పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

పెనుమంట్ర: మండలానికి చెందిన వలంటీలర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం బ్రాహ్మణచెరువు సెంటర్‌లోని శ్రీ సాయినాథ కళ్యాణ మండపంలో జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు చెరకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా హాజరై వాలంటీలర్లుకు అవార్డులు అందజేస్తారని ఆయన తెలిపారు.

పర్యావరణంపై కళాజాత ప్రదర్శన


ఆకివీడులో కళాజాత ద్వారా ప్రచారం చేస్తున్న కళాకారులు

ఆకివీడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, కాలుష్య కోరల్లో చిక్కుకున్న జీవం మనుగడను రక్షించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడిందని కళాజాత కళాకారులు తమ ప్రదర్శన ద్వారా తెలియజేశారు. స్థానిక చేపల మార్కెట్, గుమ్ములూరు సెంటర్ తదితర ప్రాంతాల్లో గురువారం కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం, వాటివల్ల వచ్చే అనర్థాల్ని వివరించారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా జీవం మనుగడ ఉంటుందన్నారు. కళా జాత ప్రదర్శనలో కళాకారులు తిరుపతి కుమార్, వి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించాలి


ఇలపర్రులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు పద్మావతి

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. గురువారం ఇలపర్రు శివారు అభోతుల దిబ్బలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేదన్నారు. వీరిని ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారన్నారు. ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వేండ్ర వెంకటేశ్వర్లు, పులిదిండి వెంకటేశ్వర్లు, గుణపాటి సంజీవరావు, కటికదల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి


ఇల్లిందలపర్రు లాకుల రోడ్డులో మూసూళ్లు చేసిన ధాన్యం బస్తాలు, రాశులు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల వద్ద ఇప్పటి వరకూ 3372 మంది రైతుల నుంచి 27311 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జ్యోషుల గురువారం తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో దాదాపు ధాన్యం మాసూళ్లు పూర్తికావచ్చాయని దాదాపు 70 నుంచి 80 ఎకరాలు మాత్రమే కోతకోయాల్సి ఉందని ఆమె తెలిపారు. మాసూళ్లు చేసిన ధాన్యం ఇంకా 20 శాతం రాశుల్లో ఉందని రెండు మూడు రోజులలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు పూర్తి అవుతాయని ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటి వరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో 231 మంది రైతుల నుంచి 2183 మెట్రిక్ టన్నులు, భట్లమగుటూరులో 230 మంది రైతుల నుంచి 2022, జుత్తిగలో 256 మంది రైతుల నుంచి 1732, మల్లిపూడిలో 212 మంది రైతుల నుంచి 1395, మాముడూరులో 268 మంది రైతుల నుంచి 1584, మార్టేరులో 296 మంది రైతుల నుంచి 1977, నత్తారామేశ్వరంలో 135 మంది రైతుల నుంచి 1024, నెలమూరులో 189 మంది రైతుల నుంచి 1429, ఓడూరులో 165 మంది రైతుల నుంచి 2087, పెనుమంట్ర 1లో 112 మంది రైతుల నుంచి 793, పెనుమంట్ర 2 లో 242 మంది రైతుల నుంచి 2066, పొలమూరులో 272 మంది రైతుల నుంచి 2537, సత్యవరంలో 224 మంది రైతుల నుంచి 1807, వెలగలవారిపాలెంలో 186 మంది రైతుల నుంచి 1625, సోమరాజు ఇల్లిందలపర్రులో 348 మంది రైతుల నుంచి 2039, వెలగలేరులో 79 మంది రైతుల నుంచి 470 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిన్నటి వరకూ కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు రవాణా చేసామని రైతులందరికీ ఆయా రైతు భరోసా కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

నేడు వలంటీర్లకు వందనం

ఉండి: ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉండి, అర్తమూరు, చెరుకువాడ, కలిసిపూడి, పెదపుల్లేరు గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్‌లను సత్కరించి వారికి అవార్డులు ప్రదానం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సత్కరిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సాక్షి, భీమవరం: వన్‌టౌన్ పరిధిలోని గురువుపేట సమీపంలో ఎం.జయ తనను కొట్టి గాయపరిచాడని కె.అభిషేక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు. ఈనెల 24వ తేది రాత్రి తన సోదరుడితో కలిసి ఇంటికి వస్తుండగా ఖాళీ బీరు సీసాతో కొట్టి దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ శేషావతారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

నరసాపురం: స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం పిల్లలకు వైఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పొన్నాడ సుబ్రహ్మణ్యం రసాయనశాస్త్రం క్లాసులు నిర్వహించారు. కెమిస్ట్రీలో పిల్లలు భయాలు పెట్టుకోకూడదని చెప్పారు. శాస్త్రవేత్త ఆర్‌వీ సుబ్బారావు కాంతి సంవత్సరం, కాంతివేగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్ పిల్లలకు నీతి కథలు చెప్పారు. డాన్స్ మాస్టర్ విక్టర్‌రాజు పిల్లలకు డ్యాన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ నూతన అధ్యక్షుడిగా వంగా

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వంగా నరసింహరావు ఎంపికయ్యారు. గురువారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా వేగేశ్న వెంకట తిరుపతిరాజు, అధ్యక్షుడిగా వంగా నరసింహరావు, సెక్రటరీ ముత్యాల రామారావు, ట్రెజరర్‌గా మాఘం బాల కొండలరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండ్రెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కొల్లి నరసింహరావు, కె.వి.ఎస్.ఎల్ నరసింహరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరిచర్ల సత్యప్రతాప్‌రాజు, జాయింట్ సెక్రటరీ కారుమూరి వెంకట దుర్గాప్రసాద్, గుత్తుల సత్యనారాయణమూర్తి, కలిదిండి వెంకటపతి వర్మ, పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వి.నారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, రంగారావు, వీవీ తిరుపతిరాజు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.